# నాన్నా... నన్ను బతికించు

కాలేజీ నుంచొచ్చి గదిలోకి కాలుపెడుతూన్న కిరణ్మయి గదిలోని వాతావరణాన్ని చూసి క్షణం సేపు మూగబోయింది నోటిమాటరాక, ఎప్పుడూ ఏవో కబుర్లు చెబుతూ ఇంట్లో వాళ్లతోనో ఇరుగు పొరుగుతోనే కాలక్షేపం చేసే బామ్మ, ఆ కబుర్లలో కూడా మధ్యమధ్యన ఎన్నో జోక్స్ చెబుతూ నవ్వుతూ నవ్వించే బామ్మ ఇలా పమిట కొంగు ముఖానికి కప్పుకుని రోదిస్తున్న బామ్మని ఎప్పుడూ చూడలేదు కిర్మణయి. తనకి బుద్ధి తెలిసినప్పటి నుంచీ కూడా !

అందరూ ఆమెని ఓదార్చడానికి ప్రయత్నం చేస్తున్నారు. కిరణ్మయి తల్లికేసి చూసింది. ఆమె ఏడుస్తోంది. ఏం జరిగిందో తెలుసకోవాలని తల్లి దగ్గరి కెళ్లి "ఎందుకమ్మా అందరూ ఏడుస్తున్నారు? ఏం జరిగింది?' అడిగింది కిరణ్మయి.

"సంగీత చనిపోయిందమ్మా! ఇప్పుడే టెలిగ్రాం ఓచ్చింది" కళ్లు తుడుచుకుంటూ చెప్పింది నిర్మల.

కిరణ్మయికి కళ్లు తిరిగి నట్టనిపించింది.

"మన సంగీత చనిపోయిందా? ఎలా? టెలిగ్రాం సరిగ్గి చూశారా? ఎవరిచ్చారూ?" ఇత్యాది ప్రశ్నల వర్షం కురిపించింది కిరణ్మయి" ఆశ్చర్యంగా - ఆ విషయం అబద్ధమయినట్టు, తను నమ్మలేకపోతున్నట్టూ!

అవునమ్మా.... మన సంగీతే! ఎలకల మందు తాగిందిట! బాబాయే గుంటూరు నుంచి టెలిగ్రాం ఇచ్చాడు" అంది నిర్మల. సాధ్యమైనంత తాపీగా, కిరణ్మయిని కంగారు పెట్టకుండా వుండడానికి ప్రయత్నిస్తూ. "ఏమిటీ?... మన సంగీత.. ఎలకల మందు తాగిందా? నమ్మలేక పోతున్నానమ్మా.. చెంచాడు దగ్గుమందు తాగమంటే, గంటసేపు చేసేది, వాసన, చేదూ.. అని ముక్కు చెవులూ మూసుకుంటూ! అటువంటి. సంగీత.. ఇలా చేసిందంటే నమ్మలేక పోతున్నాను' కన్నీరు చెంపల మీదుగా కారుతుంటే, తుడుచుకుంటూ అంది కిరణ్మయి.

ఆ మాటలు విన్న బామ్మ, "అవునే తల్లీ! అదే నాకూ అంతుపట్టడంలేదు. ఎప్పుడైనా జలుబు చేస్తే, మిరియాల కషాయం కాచిస్తానంటే 'బాబోయ్ ఘాటు'అంటూ పరిగెత్తేది, అంత పని ఎలా చేసిందో అర్థం కావడం లేదు" ఈసారి బామ్మ భోరుమని ఏడ్చేసింది.

"ఊరుకో బామ్మా!" అంటూ ఓదార్చబోయిన కిరణ్మయిని పసిపిల్లలా చుట్టేసింది విశాలాక్షి.

ఆ దృశ్యం చూసి అక్కడున్న వాళ్లంతా కంటతడి పెట్టుకున్నారు.

"ఊరుకోండత్తయ్యా.. కొంచెం మంచినీళ్లు తాగండి" అంటూ గ్లాసును నోటి కందించింది నిర్మల.

ఒక్క గుక్క తాగి గ్లాసుని పక్కకి నెట్టేసింది విశాలాక్షి . మళ్లీ బిగ్గరగా ఏడుస్తూ!

ఈలోగా రాజాచంద్ర వచ్చేడు గుంటూరు ప్రయాణానికి టిక్కెట్లు కొనేసి.

నిర్మలని పిలిచి వెంటనే సామాన్లు సర్దేయమన్నాడు రాత్రి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కి!

రాజాచంద్రరాగానే ఇరుగుపొరుగులు మెల్లమెల్లగా వెళ్ళిపోయారు. నిర్మల అందరి బట్టలూ సూట్‌కేసులో సర్దడం మొదలెట్టింది.

* * *

విశాలాక్షికి రాజాచంద్ర, రామ్‌చంద్ర ఇద్దరు కొడుకులూ, శ్యామలారాణి కూతురు! రాజాకి, కిరణ్మయి, నవీన్ ఇద్దరు పిల్లలు. రామ్‌కి సంగీత, సుమన్ ఇద్దరు పిల్లలు. శ్యామలారాణికి ఒక్కడే కొడుకు హరీష్! రాజాకీ, రామ్‌కీ మధ్య రెండేళ్లే వ్యత్యాసం కావడం వల్ల చదువులూ ఉద్యోగాలే కాదు, పెళ్ళిళ్లూ పిల్లలూ కూడా అలాగే పుట్టారు. సంగీత, కిరణ్మయి కంటే ఒక సంవత్సరం చిన్న ! రామచంద్రకి సంవత్సరం క్రితమే హైదరాబాద్ సర్వే డిపార్టుమెంటు నుంచి గుంటూరుకి ట్రాన్స్‌ఫర్ అయింది. రాజాచంద్రకి ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసరుగా హైదరాబాద్‌లోని కస్తూరిబా గరల్స్ హైస్కూల్లోనే జరిగింది. ఇద్దరూ సైన్స్ స్టూడెంట్సే. ఇద్దరికీ చదువులో కూడా ఒక్క తరగతే తేడా! కలిసి స్కూలుకి వెళ్లడం కలిసి ఇంటికి రావడం, ఎక్కడి కెళ్లినా ఇద్దరూ కలిసి వెళ్లడం, అందరికీ వాళ్లిద్దరినీ చూస్తే ముచ్చటగా వుండేది. అన్నదమ్ములిద్దరూ కలిసే వుండడం వల్ల కూడా, ఇంట్లోనూ స్కూలు కబుర్లూ, స్నేహితుల కబుర్లూ ఎక్కువగా వుండేవి. విశాలక్షికి వీరిద్దరూ రెండు కళ్లూ, రెండు కాళ్లూ, రెండు చేతులునూ. 'బామ్మా.. బామ్మా'... అంటూ అప్పుడప్పుడు చిన్న పిల్లలా మారాం చేసేవారు. ఆవిడని ఆట పట్టించేవాళ్లు. పసిపాపల్లా ఒళ్లోపడుకుని ఆమె చెప్పే కథలు వింటూండే వారు! గ్యాప్ అంటూ వుంటే ఇద్దరి మధ్యనా, ఈ సంవత్సరం మాత్రమే. అందుకే ఈవార్త కిరణ్మయిపైన పిడుగు పడినట్టయింది.

సంగీత పేరుకు తగ్గట్టు చక్కగా పాడేది. కిరణ్మయి వీణ వాయిస్తుంది. ఇద్దరూ కలిసి అలా గంటల తరబడి విశాలాక్షిని, ఇంటిల్లిపాదినీ ఆనంద పరిచేవారు. స్కూలు ఫంక్షన్లల్లో కూడా వీళ్ళ జంట అలాగే పాల్గొనేది. సంగీత హైదరాబాద్ బదిలీ అయి వెళుతుంటే విశాలాక్షి, రాజాచంద్ర ఒద్దన్నారు. తనని ఇక్కడే ఉండమన్నారు. కానీ రామచంద్ర ఒప్పుకోలేదు. దాన్ని చూడకుండా వుండలేనన్నాడు. అది తల్చుకుని అందరూ మళ్ళీ వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టారు. ఇప్పుడెలా వుంటావురా పిచ్చినాన్నా" అంటూ విశాలాక్షి ఏడుస్తూంటే మిగతా వాళ్లకి కడుపు తరుక్కుపోతోంది.

సంగీతని ఇక్కడే వుంచి సంగీతంలో బి.ఎ. ఎం.ఎ. చేయించి మ్యూజిక్ కాలేజీలో చేర్పించమని విశాలాక్షి చెప్పేది. మొదలు డిగ్రీ అయిపోనీయమ్మా. అప్పుడు మ్యూజిక్ డిగ్రీలకి కట్టించవచ్చు. ఈలోగా అక్కడ ఎవరిదగ్గరైనా మంచి గురువు దగ్గర సంగీతం నేర్పించి, ప్రైవేట్‌గా కూడా, పరీక్షలు కట్టించవచ్చు" అన్నాడు రామచంద్ర.

గుంటూరు వెళ్లాక, అక్కడి స్నేహితులూ, వాళ్ల సలహాలతో మెడిసిన్ చెయ్యాలని వాళ్లందరి ప్రోత్సాహంతో పాటు కోచింగ్ సెంటర్‌లో చేరింది. ఎంతకష్టపడ్డా ఆ చదువు కొంచెం కూడా బుర్రకెక్కేది కాదు సంగీతకి. మానేద్దామంటే స్నేహితులు, చాతకాని తనం అని హేళన చేస్తారేమోనన్న భయం. తనలో తనేకుమిలి పోయేది. కూతురి ఆందోళనకి కారణం తెలియని రామచంద్రా, ప్రభావతీ దిగులుపడి ఎన్నోసార్లు 'ఎందుకమ్మా అలా వున్నావ్? నీకా సబ్జెక్ట్సు కష్టంగా వున్నాయా? ఒదిలేసెయ్. లేదా హాయిగా హైదరాబాద్ కెళ్ళి అక్కడ నీ ఇష్టం వచ్చిన కోర్సులో చేరు" అని చెప్పేవారు. 'అలాగే చేస్తాను'అనేది ముక్తసరిగా. కానీ స్నేహితులముందు తను చాతకానిది అపిపించు కోవడానికి మనసు ఒప్పుకోక, తనలో తనే మధన పడిపోయేది. తనలో తనకే సంఘర్షణ! స్నేహితుల ముందు ఓడిపోతున్నానన్న న్యూనతాభావం. ఒక రకమైన డిప్రెషన్‌లో పడి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో బతకడం ఇష్టం లేనంత అయిష్టాన్ని పెంచుకుని, ఎలుకల ముందు తాగేసింది! కూరలకోసం బజారుకెళ్లిన ప్రభావతి తిరిగొచ్చేసరికి నోట్లోంచి నురగలు కక్కుతోంది సంగీత. పక్కనున్న మందూ, గ్లాసూ చూసి, పరిస్థితి గ్రహించి, వెంటనే ఆసుపత్రికి తీసికెళ్లి జాయిన్ చేసి భర్తకి ఫోన్ చేసింది. స్టమక్ వాష్ చేశారు. మందులిచ్చారు. అప్పటికే స్పృహ కోల్పోయింది.

సంగీత! రామచంద్ర ప్రభావతీ కంటికీ మింటికీ ఏకధారగా ఏడవడం మొదలెట్టారు. వీలున్నదేవుళ్లందరికీ మొక్కుకున్నారు. సంగీతకి తెలివొచ్చింది. "అమ్మా... నాన్నా..." అంటూ పిలిచింది. పరుగెత్తుకెళ్లారు మంచం దగ్గరికి రామూ ప్రభలతో "నన్ను క్షమించమ్మా.. తప్పు చేసేశాను. నాన్నా.. ఆవేశంలో అప్పుడు నాకు చావాలనిపించింది. నాన్నా: హైదరాబాద్ వెళ్లి

బామ్మ చెప్పినట్టు మ్యూజిక్ బి.ఎ. చేస్తాను. నన్ను ఎలాగైనా బతికించు నాన్నా.. నాన్నా.. ప్లీజ్.. నాన్నా'అంతే! కోయిల గొంతు నులిమేసినట్టు, పలికే చిలకని చీల్చేసినట్టు, నిశ్శబ్దం! చలనం లేని శరీరం.. ఘొల్లుమన్నారు రామచంద్రా ప్రభావతీ! భూమి దద్దరిల్లినట్టయింది. ఆకాశంలోంచి పిడుగు పడ్డట్టయింది.. "అమ్మా.. తల్లీ.. మాట్లాడమ్మా.. అమ్మా.. సంగీతా.. ఏమై పోయాయమ్మా నీ పాటలు? ఎందుకిలా చేశావమ్మా? నిండు నూరేళ్ల పాటలాంటి నీ బతుకుని, పల్లవిలోనే ఆపేసుకున్నా వెందుకమ్మా.." నెత్తీనోరు కొట్టుకుంది ప్రభావతి. తలబాదుకున్నాడు రామచంద్ర. ఇవేవీ కనిపించని, వినిపించని దూరతీరాలకు వెళ్లిపోయింది సంగీత.

"పద్దెనిమిదేళ్లు.. కాదు కాదు పదహారు వెళ్లి పదిహేడొస్తాయి ఎల్లుండికి.. నా చిట్టితల్లి పెళ్ళి వాళ్ల బామ్మ కళ్ల ముందే చిన్నప్పుడే చెయ్యాలనుకున్నాను. ఏమండీ! ఎందుకిలా చేసిందది? నేనేం పాపం చేశాను?" గుండె బద్దలయ్యేలా ఏడ్చిందిప్రభావతి. డాక్టరు కాంపోజ్ ఇంజక్షనిచ్చి పడుకోబెట్టారామెను. క్షణంలో దావానలంలా వ్యాపించిందీ వార్త. కాలేజీవాళ్లు, ఆఫీసు వాళ్లు. ఇరుగు పొరుగులతో నిండిపోయింది. ఆ ఇల్లు! కాదు ఆ వాడ!

ఇల్లు చేరుకున్న రాజాచంద్ర, నిర్మల, విశాలాక్షి, కిరణ్మయిలు ఏడుపు తప్ప మాటరాని వాళ్లలా అయిపోయారు చాలాసేపు. "సంగీతా".. అంటూ అరుస్తున్న కిరణ్మయిని చూస్తుంటే, ఆ పిలుపుకి తిరిగి ఒస్తుందేమో సంగీత అనిపించేలా ఆమె ఆక్రందన, గుండె గుండెకీ ములుకులా గుచ్చుకుంది. ఆ పిలుపు, ఆ ఏడుపూ అంతా అరణ్య రోదనే! చూస్తూ చూస్తూ, అంతా క్షణాల్లో జరిగిపోయింది. సంగీత శరీరం కూడా మట్టిలో కలిసిపోయింది.

"బామ్మ ఒళ్లో పడుకుని, కోయిలలా పాడే నీ గొంతు ఇంక బామ్మ వినలేదే" అంటూ బామ్మ ఏడుపు!

"నన్ను క్షమించమ్మా.. ఆవేశంలో ఆలోచించలేక, అర్థం లేని ఊహలతో నా బతుకుకి నేనే చిచ్చు పెట్టుకున్నాను" పదే, పదే ఆ మాటలే గుర్తుకు తెచ్చుకుంటూ రోదించే తల్లి.

"నాకు బతకాలని వుంది నాన్నా! ప్లీజ్! నన్ను బతికించవూ? మరోసారి ఇలాంటి ఇలాంటి తప్పు చేయను, ప్రామిస్!" చెవులో రింగుమంటున్న ఈ మాటలతో కుంగిపోతున్న తండ్రి!

కిరణ్మయి ఆలోచిస్తోంది! "తన ఈడుదే సంగీత! అయినా స్నేహితులు హేళన చేస్తారనో, తన అసమర్థత వల్ల కించపరుస్తారనో అనుకుని, బతుకుని ధ్వంసం చేసుకోవడం ఎంత అవివేకమో" తన స్నేహితురాళ్లకి ఉత్తరాలు రాస్తోంది. ఇంజనీరింగ్‌లో సీటు రాలేదనీ, మెడిసిన్ సీటు రాలేదనీ, లేదా అనుకున్నది జరగలేదనీ, ఆత్మహత్యలు చేసుకున్న వాళ్ల సంగతి మనం చాలా సార్లు విన్నామే! కానీ, ఆ తరువాత వాళ్ల తల్లిదండ్రులు, బంధువులూ

ఎంత బాధపడతారో, ఎంత నరకాన్ని అనుభవిస్తారో, ప్రత్యక్షంగా మా సంగీత వల్ల తెలుసుకున్నాను. జీవితంలో అధైర్యం వుండకూడదు! న్యూనతాభావం రాకూడదు! చచ్చిపోదామన్న ఆలోచన ఎట్టి పరిస్థితుల్లోనూ రానీయకూడదు. బతకడం ఒక వరం!" అంటూ కిరణ్మయి తన స్నేహితులందరికి ఉత్తరాలు రాసింది. అలా ఎందరికి ఎన్ని రాసిందో?" వీలైనంత మందికి తను ఈ మాటలు చెప్పాలి. ఏ పిల్లా ఇలా ఆత్మహత్యకు తలపడకుండా చూడాలి" - ఇదే కిరణ్మయి బుర్రలోని ఆలోచనలు!

కాలం సాగిపోతూనే ఉంది! ఎవ్వరికోసం ఆగదు!

విశాలాక్షి కిరణ్మయి రోజూ రాస్తున్న ఉత్తరాలన్నీ చదివీ, ఉత్తరాలన్నీ చూసీ, ఆమె మనస్సును కూడా చదివింది. వికసించిన పువ్వు వాడిపోతున్నట్టు ఆ పిల్ల మనసు వేగిపోతున్నట్టు గ్రహించింది. కిరణ్మయిని పిలిచి అలా వాకింగ్‌కి వెళదాం రమ్మని, ఏవేవో కబుర్లు చెబుతూ బయలుదేరింది. 'మనస్సునే' చదువులో 'డెబ్బై ఏళ్లనే' డిగ్రీని పొందిన విశాలాక్షి! ప్రతిరోజూ ప్రతీక్షణం కిరణ్మయిని కనిపెడుతూనే వుంది. కంటికి రెప్పలా! పోయిన సంగీత తిరిగి రాదు. కిరణ్మయినీ, కిరణ్మయి వంటి అమాయకత్వపు అమ్మాయిలను కాపాడాలి! అదే ఆమె జీవన ధ్యేయం! కనిపించిన ప్రతీ అమ్మాయికీ పరీక్షలంటే భయపడవద్దనీ, జీవితాన్ని మనకనుగుణంగా మార్చుకోవాలి గానీ, తప్పించుకుని జీవితానికి దూరంగా పారిపోకూడదు' అని చెబుతూ వుంటుంది!

ఇప్పుడు అందరిలోనూ సంగీత కనిపిస్తుంది విశాలాక్షికి! అందరి కంఠం సంగీతలాగే ఖంగున మ్రోగినట్టనిపిస్తుంది ఆమెకి!

కోకిల ఎక్కడుంటుందో ఆకుల మాటున ఎవరికీ కనిపించదు. కానీ కోకిల పాట అందరికీ వినిపిస్తుంది. ఎప్పుడూ గుర్తుంటుంది. 'నా సంగీత కోకిలేనమ్మా' అంటుంది నవ్వుతూ ప్రతీ వాళ్లతో విశాలాక్షి. ఒక ఋతువులో కాదు ప్రతి నిత్యం నా చెవిలో పాడుతూనే వుంటుందే నా కోకిల" అంటుంది అందరితో విశాలాక్షి. విశాలాక్షి అలా మాట్లాడుతుంటే కంట తడి పెట్టుకుంటారు. చుట్టూ వున్నవాళ్లు ముఖ్యంగా నిర్మలా రామచంద్రా 'అనేక రోగాలతో ఒత్తిళ్లతో ఉరుకులు పరుగులు వేగాన్ని తట్టుకోలేక అస్వస్థతతో, అనేక ఇతర కారణాల వల్ల ప్రాణాలు పోతూ వుంటే, ఇలా బలవంతంగా ప్రాణాలు తీసుకోవడం న్యాయమా చెప్పండి పిల్లలూ! ఆవేశంలో మీరు చేసే పనికి మీ పెద్దలు జీవితాంతం ఎంత బాధపడతారో ఊహించుకుంటే మీరు అలా ప్రవర్తించరు! ఆలోచించండి" అంటూ సంగీత చదువుకున్న కళాశాల ప్రిన్సిపాల్ రాధారాణి సమయం దొరికినప్పుడల్లా చెబుతూ వుంది. 'జీవితం జీవించడానికి! మధ్యలోనే తుంచేయకండి" అంటారామె ప్రతీ విద్యార్థినీతో సమయం చిక్కినప్పుడల్లా.

* * *